


# ఇంటి ఓనర్

- కైపు ఆదిశేషారెడ్డి

**"ఏవండోయ్... చెప్పటం మర్చిపోయాను. మధ్యాహ్నం వెంకట్రావుగారు మీకోసం వచ్చారు..." రాత్రి పడుకోబో యేముందు గుర్తొచ్చి చెప్పింది సరిత.**

"ఎందు కట...?" అడిగాడు సుందరం.

"విషయం చెప్పలేదు. ఈరోజు ఆదివారంకదా... యింట్లో వుంటావని వచ్చాడట...! తర్వాత కలుస్తాలెమ్మని వెళ్లిపోయాడు..." చెప్పింది సరిత.

వెంకట్రావుగారు ఇంటి ఓనరు. ఉన్న నాలుగు పోర్షన్లు అద్దెకిచ్చి... అదే వీధి లోని మరో సింగిల్ హౌస్‌లో వుంటాడు. ఫస్ట్ వీక్‌లో అద్దెలకు, సెకండ్ వీక్‌లో కరెంట్ బిల్లులకు వస్తూ వుంటాడు. మధ్యలో అవసరమైతే గాని యిటువైపు రాడు...!

కాకపోతే... అప్పుడప్పుడూ యేదైనా మనీ సర్దుబాటు అవసర మైతే కలుస్తాడు. ఇంటి ఓనర్ కదా... అడిగితే యివ్వకపోతే బాగుండదని... తను సర్దుబాటుచేస్తూ వుంటాడు. అయితే... తర్వాత నెలలోని అద్దెలో జమ వేసుకొంటాడేగాని... యేమంత యిబ్బంది పెట్టే రకం కాదు.

బహుశా... అలాంటి అవసరమేదైనా వచ్చి వుంటుంది... వుదయాన కలిసి మాట్లాడొచ్చు... అనుకొని... అంతటితో ఆ విషయాన్ని ఫుల్‌స్టాప్ పెట్టి నిద్రకుపక్రమించాడు సుందరం.

* * *

ఉదయాన వాకింగ్‌కి వెళ్లివచ్చిన సుందరం... వరం డాలో కూర్చుని పేపర్ తిరగేస్తూ... గేటు చప్పుడుకా గానే... తలెత్తి చూశాడు.

వెంకట్రావు గేటు తీసుకొని లోపలికి వస్తూ కన్పిం చాడు.

"రండి సార్...! నిన్న వచ్చి వెళ్లారట...! నేనే వద్దా మనుకొంటున్నాను..." అంటూ వెంకట్రావుని సాద రంగా ఆహ్వానించాడు సుందరం.

"పర్లేదు సుందరంగారూ...! మీరు ఆఫీసుకెళతారే మోనని... వుదయన్నే వచ్చాను..." అంటూ ఎదురుగా కుర్చీలో కూర్చొన్నాడు వెంకట్రావు.

"ఏంటి సార్... విషయం...?"

"విషయమంటూ యేమీలేదు... వూరకే మాట్లాడి వెళదామని..."

అలా అన్నాడేగాని... లోపల యేదో వుందనిపిం చేలా అన్పించింది సుందరానికి.

"విషయమేంటో చెప్పండి సార్... నా దగ్గర మీకేం కొత్త కాదుగా..."

నవ్వుతూ అడిగాడు... యెన్నోసార్లు అక్కరకు తన దగ్గర డబ్బు తీసుకొన్న సంగతి గుర్తొచ్చిన సుందరం.

"మరేం లేదు సుందరంగారూ...! నాకో సమస్య వచ్చి పడింది. యేం చేయాలో... మీతో యెలా చెప్పాలో... అర్థంకావటంలేదు. చెప్పాలంటే... బాధగా వుంది... అయినా చెప్పక తప్పేట్లు లేదు...!" అసలు విషయం చెప్పకుండానే యెంతో బాధతో చెపుతున్న వెంకట్రావు వంక ఆశ్చర్యంగా చూడసాగాడు సుందరం.

అంతలో... "యిదిగోండి బాబాయిగారూ...కాఫీ..." అంటూ వచ్చింది సరిత.

కప్పు అందుకొంటూ... "యిప్పుడివన్నీ యెందుక మ్మాయ్... యింటి దగ్గర త్రాగే వస్తున్నాను...!" అన్నాడు వెంకట్రావు.

"పర్లేదులే బాబాయ్... కాఫీయే కదా...!" అంటూ లోపలికెళ్లింది సరిత.

కాఫీ త్రాగటం పూర్తిచేసి... కప్పు టీపాయి మీద వుంచుతూ... "మీరు మరేమీ అనుకోకపోతే... ఒక విషయం చెప్పాలి సుందరం గారూ..."అంటూ ముందుకు వంగారు... చెప్పక తప్పదనే నిర్ణయం తీసు కున్న వెంకట్రావు.

"చెప్పండి సార్...! యింతదాకా వచ్చి... విషయం నాన్చడమెందుకు...!"

"మరో రెండు నెలల్లో గుంటూరునుండి మా అన్నయ్య కొడుకు వస్తున్నాడు. వాడు అక్కడనుండి ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్ చేయించు కొనే ఆలోచనలో వున్నాడట...! వాడికి యిల్లు అవ సరం అయ్యేట్లు ఉంది. మీరు యిబ్బంది పడగూ డదని... ముందుగా ఓమాట చెపుతున్నాను...!" అసలు విషయం బయటపెట్టాడు వెంకట్రావు.

సుందరానికి గుండెల్లో రాయిపడినంత పన యింది...!

తాను వూహించింది ఒకటైతే... ఆయన చెప్పింది మరొకటి...!

ఒక్కసారిగా... షాక్‌కి గురైనట్లు ఫీలయ్యాడు.

అది గమనించిన వెంకట్రావు... "గాభరా పడకండి సుందరంగారూ...! మీరు యిప్పటికిప్పుడే వెకేట్ చేయాల్సిన పని లేదు. టైమ్ తీసుకొని... స్థిమితంగా మరో యిల్లు చూసుకొని... ఖాళీచేయవచ్చు...!" అని చెప్పాడు.

మౌనంగా తలూపాడు సుందరం.

"మీలాంటివారు యెంత కాలమున్నా మాకు యిబ్బంది లేదు. యిల్లు నీట్‌గా వుంచుకొంటున్నారు. అద్దె ఏ నెలకానెల కచ్చితంగా యిస్తున్నారు. మా యిల్లు మీ యిల్లే అన్నంతగా చూసుకొంటున్నారు. అలాంటి మిమ్మల్ని ఖాళీ చేయమనటానికి మనసు రావటంలేదు... యేం చేద్దాం... తప్పనిసరి అయింది...! వేరే పోర్షన్‌లోని వారిని ఖాళీ చేయి ద్దామంటే... వాడికి యీ పోర్షనే కావాలట...! దీని కైతే... యింటిముందు ఖాళీ స్థలం, గార్డెన్ వున్నా యట...!"

తను చెప్పాలనుకొన్నది గడగడా చెప్పేసి... సుందరం ముఖంలోకి... సమాధానంకోసం చూస్తుం డిపోయాడు వెంకట్రావు.

"అలాగే...! నన్ను కొంచెం ఆలోచించుకోని వ్వండి...!" కొన్ని క్షణాల మౌనం తర్వాత చెప్పాడు సుందరం.

"తప్పకుండా... ఆలోచించుకునే నిర్ణయం తీసు కోండి...! మిమ్మల్ని యిబ్బంది పెట్టటం నాకు యేమాత్రం యిష్టంలేదు. కాకపోతే... వాడు మా అన్నయ్య కొడుకు. వాడి యిష్టాన్ని కాదనలేక... మీకు చెప్పటం జరిగింది. మరోలా భావించకండి సుందరం గారూ...!" అంటూ లేచి వెళ్లిపోయాడు వెంకట్రావు.

అతను వెళ్లిపోయాక... కొద్ది క్షణాలు యేమీ తోచక అలాగే మౌనంగా వుండిపోయిన సుందరం... "ఏంటట... వెంకట్రావుగారు... యెందుకొచ్చారు..."

అంటూ వచ్చిన సరిత పిలుపుతో యీ లోకంలోకి వచ్చాడు.

"కూర్చో... సరితా...!" నీరసంగా చెప్పాడు సుందరం.

యేదో సమస్య వచ్చిందని భావించిన సరిత... "ఏం చెప్పాడేంటి...? అలా వున్నారు...?" అని అడిగింది.

"మనం ఈ యింటిని ఖాళీ చేయాలట...!"

"ఖాళీ చేయాలా... యేమైంది...? ఠంచనుగా అద్దె కడుతున్నాం కదా...! యేడాదికోసారి అద్దె పెంచినా భరిస్తున్నాం కదా...!" అంది సరిత.

"కారణం అదికాదు సరితా...! మరో రెండునెలల్లో వాళ్ల అన్నయ్యగారి కొడుకు ట్రాన్స్‌ఫర్ మీద యిక్కడకు రావాలనుకొన్నాడట... అతనికి ఈ యిల్లే కావాలట...!" చెప్పాడు సుందరం.

"అవును...! యిక్కడి వాతావరణమంతా బాగా సరిపోయిందండీ... పైగా... చుట్టుప్రక్కల వారంతా బాగా కలిసిపోయారు..." విచారవదనంతో అంది సరిత.

"యేం చేద్దాం... అద్దె యిల్లు. ఇంటి ఓనర్‌గా రిష్టం...! ఖాళీ చేయమంటే... చేయక తప్పుతుందా...!!" చెప్పాడు సుందరం.

"అందుకే... సొంతిల్లు ప్లాన్ చేయండి మహానుభావా... అంటే విన్నారా... యెక్కడికి ట్రాన్స్‌ఫర్ వస్తే అక్కడకు వెళ్లాలని... యిలా కాలం గడిపేస్తున్నారు. కానివ్వండి... యింకెక్కడ రాసిపెట్టి వుందో...! అయినా మనకు అలవాటేగా లారీకి సామాన్లు యెత్తుకొని వూరేగటం...!" విసవిసా చేతులాడిస్తూ లోపలికెళ్లింది సరిత.

వెళుతున్న ఆవిడ వంక నిర్వేదంగా చూస్తూ... తన లోతాను అదోలా నవ్వుకున్నాడు సుందరం.

❁ ❁ ❁

ఎట్టకేలకు... ఓ స్థిర నిర్ణయానికి వచ్చిన సుందరం... రెండు నెలల తర్వాత జరిగిన సాధారణ బదిలీలలో మరోచోటికి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు.

లగేజి సర్దుకొని, యిల్లు ఖాళీచేసేముందు... వెంకట్రావుకు కబురు చేశాడు.

"సుందరంగారూ...! మీరు వెళుతుంటే... సొంత తమ్ముడు వెళ్లినంత బాధగా వుంది...! బాగా కలసిపోయారు...!" అంటూ కళ్లనీళ్లు పెట్టుకొన్నాడు వెంకట్రావు.

యెంతో కాలంగా ఆ యింటితోనూ, యిరుగుపొరుగు వారితోనూ... అనుభూతులు, ఆత్మీయతలు పంచుకొన్న సుందరం, సరితలు... కళ్లంబడి నీరు సుడులు తిరుగుతుండగా... అందరికీ వీడ్కోలు చెప్పి... బయలుదేరి వెళ్లిపోయారు.

❁ ❁❁

"సుందరం...! హలో... సుందరం...!" పిలుపు విన్పించి... యథాలాపంగా నడిచిపోతున్న సుందరం... వులిక్కిపడి ప్రక్కకు తిరిగి చూశాడు.

"హాయ్... సుందరం... యెంత కాలమైంది నిన్ను చూసి..." అంటూ వచ్చి సుందరానికి షేక్ హేండిచ్చాడు.

"హాయ్... రాజేష్...! నువ్వా...? అరె... నువ్విక్కడ...!" ఆశ్చర్యంగా అడిగాడు సుందరం.

"అవును... ప్రస్తుతం నేను ఈ వూరిలోనే వుంటున్నాను. రెండు నెలల క్రితం ట్రాన్స్‌ఫర్ మీద యిక్కడకు వచ్చాను. అన్నట్లు... నీవు కూడా యిక్కడే కదా జాబ్ చేసేది...?" అడిగాడు రాజేష్.

> సొంతిల్లు ప్లాన్ చేయండి మహానుభావా... అంటే విన్నారా... యెక్కడికి ట్రాన్స్‌ఫర్ వస్తే అక్కడకు వెళ్లాలని... యిలా కాలం గడిపేస్తున్నారు. కానివ్వండి... యింకెక్కడ రాసి పెట్టి వుందో...! అయినా మనకు అలవాటేగా లారీకి సామాన్లు యెత్తుకొని వూరేగటం...!

లేదన్నట్లు తలూపాడు సుందరం.

"మరి...?" ప్రశ్నించాడు రాజేష్.

"విజయవాడకు ట్రాన్స్‌ఫర్ అయింది. రెండు నెలల క్రితమే ఈ వూరు వదిలి వెళ్లిపోయాను. నాకు సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లు, సర్వీస్ విషయాలకోసం వుదయాన్నే వచ్చాను. పనయిపోయింది. బస్టాండ్‌కి వెళుతున్నాను..." చెప్పాడు సుందరం.

"అవునా...!"అని ఆశ్చర్యం వ్యక్తంచేసి... "సరే సరే... చాలా కాలానికి కలిశాం...అలా యెక్కడైనా కూర్చొని కాసేపు మాట్లాడుకుందాం..."అంటూ దగ్గర్లోని రెస్టారెంట్‌కి దారి తీశాడు రాజేష్.

సుందరం అనుసరించాడు.

యిద్దరూ ఒక బల్లముందు కూర్చొని... చిన్ననాటి కబుర్లను నెమరేసుకుంటూ... స్నాక్స్ తిని... టీ త్రాగారు.

"మళ్లీ యెప్పుడు కలుస్తామో... యేమో...! ఒకసారి యింటికి వచ్చి వెళ్లకూడదూ...! యిల్లు దగ్గర్లోనే..." ఆహ్వానించాడు రాజేష్.

"యిప్పుడెందుకులే...! నువ్వెటూ కన్పించావుగా...! యింకోసారి వచ్చినపుడు వస్తాన్లే...! అడ్రస్ యివ్వు...?" చెప్పాడు సుందరం.

అడ్రస్ చెప్పాడు రాజేష్.

"ఆ సందులోనా... నేను వున్నదీ ఆ సందులోనే...! యెవరింట్లో...?" ఆసక్తిగా అడిగాడు సుందరం.

"వెంకట్రావుగారి యింట్లో..."

"వారింట్లోనా... యే పోర్షన్..." ఆశ్చర్యంగా అడిగాడు.

"క్రింది పోర్షనే... గార్డెన్, ఖాళీ స్థలం వుంది కదా... అదే...!"

మరింతగా ఆశ్చర్యపోయిన సుందరం... "అయితే... వెంకట్రావుగారు మీ బాబాయ్ అన్నమాట...!" అని అడిగాడు.

"వెంకట్రావు మా బాబాయి కావటమేంటి...! ఆయన నాకు చుట్టం కాదే...! ఇంటి ఓనర్... అంతే...!" చెప్పాడు రాజేష్.

"తన అన్న కొడుకుకి కావాలంటూ... ఆ యింట్లోంచి నన్ను ఖాళీ చేయించాడు. మరి నీకు..." విస్తుపోయాడు సుందరం.

"అవునా... టులెట్ బోర్డ్ పెట్టి వుంటే... అద్దెకు తీసుకొన్నాను..."

"అద్దె యెంత...?"

చెప్పాడు రాజేష్. గుండె ఝల్లుమంది సుందరానికి...! తను యిస్తున్న రెంట్‌కి పదిహేనువందలు యెక్కువ...! విషయం అర్థమైంది సుందరానికి.

"అమ్మో...వెంకట్రావ్... రెంట్ పెంచుకోడానికి... యెంత నాటకం...!" ఆశ్చర్యపోతూ మనసులో అనుకొన్నాడు సుందరం.

★


**రచయిత చిరునామా:**
కైపు ఆదిశేషారెడ్డి,
జి.ప. ఉన్నత పాఠశాల
కొమరిక, ఇందుకూరుపేట (మం)
ఎస్‌పిఆర్ నెల్లూరు జిల్లా- 524 314.